సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



మార్కెట్లో రైతుల గోస
ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.
- 8లో▸



బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం
అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.



న్యూస్‌రీల్

నిట్ డైరెక్టర్ బదిలీ

కొత్త డైరెక్టర్‌గా బిద్యాధర్ సుబుధీ



రమణారావు, బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు బదిలీ అయ్యారు. ఆయనను ఎస్ఐటీ రాయపుర డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా కొత్త డైరెక్టర్‌గా ఐఐటీ గోవాలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న బిద్యాధర్ సుబుధీ రానున్నారు. ఈయన నియామక ఉత్తర్వులు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

10మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పీజీ ఫైనలియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 10మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల అధికారులు మల్లారెడ్డి, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

మానవతా దృక్పథంతో ఉత్తర్వులు రద్దు చేయాలి



విద్యారణ్యపురి: టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు వివిధ కారణాలతో విధులు నిర్వర్తించలేమని దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు మానవతా దృక్పథంతో వాల్యుయేషన్ ఉత్తర్వులను రద్దు చేయాలని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరిలు గురువారం క్యాంపు ఆఫీసర్, డీఈఓ అబ్దుల్‌హైకి వినతిపత్రం సమర్పించారు. ఆనారోగ్యంతోపాటు వివిధ కారణాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



విద్యారణ్యపురి: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెండు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదాశివుడు, తాటికాయల కుమార్, పెండెం రాజు, బాధ్యులు దామోదర్, డి.కిరణ్‌కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, లింగారావు, కరుణాకర్, రమేష్, శ్రీనివాస్, అంజాద్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి

కాజీపేట అర్బన్: రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అంబేడ్కర్ భవన్‌లో జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర రైతు బంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, విప్ కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మేయర్, దళిత సంఘాల నాయకులు హాజరుకానున్నారు.

వరంగల్‌లో..

వరంగల్: అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్‌లు శ్రీవత్స, అశ్వినీతానాజీ వాకడేలు, దళిత సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొంది.

మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



ఆలోచన..

హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో 'దక్షిణాదికి రెండో రాజధాని ఏర్పాటు' అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. సదస్సులో వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దేశ రెండో రాజధానిగా హైదరాబాద్, అదేవిధంగా రాష్ట్రానికి వరంగల్ రెండో రాజధాని అయితే బాగుంటుందని, పాలకులు ఆలోచన చేయాలని అభిప్రాయపడ్డారు. -హన్మకొండ - వివరాలు 10లో▸

నిరుద్యోగులతో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రవదన్, పక్కన విఠల్



ఆవేదన..

కాకతీయ యూనివర్సిటీలో లైబ్రరీ ఆవరణలో నిరుద్యోగ విద్యార్థులతో బీజేపీ వేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించింది. కొన్నేళ్లుగా ఇంటికి దూరమై యూనివర్సిటీలో ఉంటూ లైబ్రరీలో చదువుకున్నామని, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలతో తమ ఆశలు ఆడియాశలయ్యాయని పలువురు విద్యార్థి నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. -కేయూ క్యాంపస్ - వివరాలు 10లో▸

రిజిస్ట్రార్ చాంబర్‌లో అంబేడ్కర్ చిత్రపటాలతో ధర్నా చేస్తున్న కార్యకర్తలు



ఆందోళన..

ఏబీవీపీ కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్యాంపస్‌లో తలపెట్టిన సెమినార్‌కి అధికారులు అనుమతి నిరాకరించడంతో గురువారం ఆందోళనకు దిగారు. రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి అంబేడ్కర్ చిత్రపటాలతో నిరసన తెలిపారు. కారిడార్‌లోని పూలకుండీలను పగులగొట్టారు. పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. - కేయూ క్యాంపస్ - వివరాలు 10లో▸

అగర్త.. ఆగమాగం!

చెరువును పూడుస్తూ రియల్ ఎస్టేట్ వెంచర్లు

- మట్టికోట చుట్టూ ఆగని ఆక్రమణలు
- కొనేది గోరంత..ఆక్రమించేది కొండంత
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ
- కలెక్టర్ స్పందించి చెరువును కాపాడాలంటున్న స్థానికులు

ఖిలా వరంగల్:



కాకతీయుల రాజ్య పరిధిలోకి శత్రుమూకలు ప్రవేశించకుండా మట్టి, రాతికోటలను అత్యంత శక్తివంతంగా నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. మట్టికోట పక్కన 7.2 కిలోమీటర్ల పొడవైన అగర్త చెరువు ఉంటుంది. పదేళ్ల క్రితం వరకు ఈ చెరువు పంట పొలాలకు సాగునీరు అందించింది. ఎంతో ఘన చరిత్ర గల చెరువు నేడు భూ ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లి అన్యాక్రాంతమవుతోంది. కొన్నేళ్లుగా ఈ వ్యవహారం సాగుతున్నా ఇప్పటికి తీసుకున్న చర్యలు లేవు. చారిత్రక ఆస్తులను రక్షించి పరిరక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు తమకేమీ తెలియదన్నట్లుగా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

చూసేదేవరు.. ఆపేదెవరు..!

ఖిలా వరంగల్ మండల పరిధిలో భూముల రేట్లు అమాంతం పెరిగాయి. మట్టికోట చుట్టూరా ఉన్న అగర్త చెరువుపై రియల్ మాఫియా కన్ను పడింది. కోట మాటున చూసేదెవరు.. ఇక ఆపేదెవరంటూ రైతుల చేతిలో ఉన్న అగర్త చెరువును రాత్రికి రాత్రే రియల్ ఎస్టేట్ మాఫియా పూడ్చివేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ నిబంధనలను పక్కన పెట్టి రెవెన్యూ రికార్డులోని లోసుగుల ఆధారంగా చెరువు స్థలాన్ని కొంతమంది పట్టాలుగా మార్చి తిరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతుల లేకుండానే ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కోట చుట్టూరా కోట్లాది రూపాయల విలువైన అగర్త చెరువు భూమి మాయం చేసి సులభంగా రిజిస్ట్రేషన్లు చేయించి అమాయకులకు అంటగడుతున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

కబ్జాదారులపై చర్యలు శూన్యం

కాకతీయుల నిర్మాణానికి 100 మీటర్ల దూరం వరకు పూర్తి నిషేధిత ప్రాంతంగా, మిగతా 100 మీటర్లు దూరం వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని నిబంధనలు ఉన్నాయి. కొందరు అధికారులు కుమ్మక్కు కావడంతో అక్రమణలకు అడ్డూ ఆదుపులేకుండా పోయింది. నిబంధనలు తమకేమీ పట్టనట్లుగానే మట్టి కోటను ఆనుకుని చెరువును పట్టాల పేరుతో పూడ్చివేసి అగర్త చెరువు స్థలాన్ని వెంచర్లుగా మార్చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు..

పట్టాల పేరుతో అగర్త చెరువు ఆక్రమణలపై కొందరు రెవెన్యూ, కేంద్ర పురావస్తుశాఖ అధికారులుకు ఫిర్యాదు చేశారు. మరికొందరు నేరుగా ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ఒత్తిడితో పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కోట చుట్టూరా ఉన్న అగర్త చెరువును సర్వే చేసి కాపాడే ప్రయత్నం చేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



ఈ ఫొటోను గమనించండి. శంభునిపేట నుంచి పడమరకోట పద్మశాలి వీధికి వెళ్లే దారిలో అగర్త చెరువు కనిపించకుండా చెత్తాచెదారంతో నింపేశారు. పట్టాలున్న రైతులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెరువు స్థలాన్ని విక్రయించినట్లు సమాచారం. ఆ చెరువును చెత్తాచెదారంతో నింపి రాత్రికి రాత్రే మొరం మట్టిపోసి చదును చేసి నిర్మాణాలకు తెరలేపుతునట్లు విమర్శలు ఉన్నాయి.



ఈ ఫొటో చూడండి. దూపకుంట రోడ్డు గిరిప్రసాద్ కాలనీ సమీపాన మట్టికోటకు ఆరు అడుగుల దూరాన రియల్‌స్టేట్ వ్యాపారులు చేసిన వెంచర్ రాళ్లు ఇవి. ఇక్కడ ప్లాట్లు చేసి ఇతరులకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి చారిత్రక కట్టడాలకు 100 మీటర్ల దూరం వరకు నిషేధిత ప్రాంతం. అక్కడినుంచి మరో 100 మీటర్ల దూరం వరకు నిర్మాణాలకు అనుమతిలేని ఏరియా. అయినా రియల్టర్లు భయపడని పరిస్థితి.

మరికొన్ని ఆక్రమణలు..

- విశ్వనాథ కాలనీ వెనకభాగం మట్టికోటను అనుకొని చెరువును చదును చేశారు. ఇక్కడ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీనిపై కేంద్ర పురావస్తుశాఖ అధికారులకు సమాచారం అందజేసినా పట్టింపులేదనే ఆరోపణలు ఉన్నాయి.
- మెట్టు దర్వాజ వద్ద విశాలమైన అగర్త చెరువు మాయమవుతోంది. చెరువును పట్టాదారుల వద్ద కొనేది గోరంతా చెరువును పూడ్చి కలుపుకునేది కొండంత ఉందంటున్నారు. దీనిపై సీపీఎం నేతలు, సామాజిక కార్యకర్తలు కేంద్ర పురావస్తుశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన రాలేదు.

దివ్యాంగులకు ఆధునిక ఉపకరణాలు

అర్హులందరికీ అందజేస్తాం

- విద్యార్థులకు ప్రీ, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు
- 'సాక్షి'తో హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమాధికారి సబిత



సాక్షి INTERVIEW

కాజీపేట అర్బన్: దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి వందశాతం సబ్సిడీతో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఉపకరణాలు అందజేస్తోంది. దీంతోపాటు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తోంది. వీటిని ఎలా పొందాలి.. ఎవరు అర్హులు అన్న అంశాలపై హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమాధికారి సబిత గురువారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: ఏయే పరికరాలు ఎంత మందికి అందజేస్తారు?

సబిత: హనుమకొండ జిల్లాలో 12,123 మంది దివ్యాంగులు ఉన్నారు. వారి అర్హతను బట్టి రెట్రో ఫిట్టెడ్ మోటార్ వెహికిల్స్, బ్యాటరీ వీల్ చైర్స్, ల్యాప్‌టాప్స్, 4జీ స్మార్ట్‌ఫోన్లు, డైసీ ప్లేయర్‌లను అందజేస్తున్నాం. వీటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అర్హతను పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం. అర్హులందరికీ అందజేస్తాం.

పరికరాల ద్వారా ఉపయోగాల ఏమిటి?

దివ్యాంగులు ప్రయాణం కొనసాగించేందుకు, స్వయం ఉపాధి, ఉద్యోగాల్లో రాణించేందుకు ఈ ఆధునిక పరికరాలు తోడ్పడుతాయి. శారీరక దివ్యాంగులతోపాటు అంధులకు ఉపయోగపడతాయి.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ఆన్‌లైన్‌లో www.tsobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి.

ఏయే ఉపకరణాలకు ఎంత వైకల్యం ఉండాలి?

సబిత: రెట్రోఫిట్టెడ్ మోటార్ వెహికల్స్‌కు 75శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి, 18 నుంచి 50 సంవత్సరాల వారు, ఇంటర్మీడియట్ పూర్తి చేసి మూడు సంవత్సరాలు పూర్తయినవారు, డిగ్రీ అపై చదువుతున్న వారు అర్హులు.

బ్యాటరీ వీల్ చైర్స్‌కు – 40శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి కండరాల, కీళ్ల, వెన్ను బలహీనత కలిగినవారు. 12 సంవత్సరాలు, అపై బడిన వారు అర్హులు. 4జీ స్మార్ట్‌ఫోన్లు – 51శాతం అంగవైకల్యం, 16 నుంచి 50ఏళ్ల వయస్సు గల వారు, ఇంటర్ అపై విద్యనభ్యసించినవారు అర్హులు. ల్యాప్‌టాప్స్‌కు – 75 కంటే ఎక్కువ అంగవైకల్యం గల అంధులు.. డిగ్రీ అపై చదువుకున్నవారు. 40శాతం అంగవైకల్యం, పీహెచ్‌డీ కోర్సు చదువుతున్న వికలాంగులు, 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల వారు అర్హులు. డైసీ ప్లేయర్ – 75 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం గల అంధులు, వికలాంగులు, ఇంటర్ అపై చదువుతున్న 15 ఏళ్ల పైబడిన వారు అర్హులు.

దివ్యాంగులకు అందిస్తున్న మరికొన్ని సంక్షేమ పథకాలు ఏమిటీ?

రాష్ట్ర ప్రభుత్వం వివాహ ప్రోత్సాహకం కింద వికలాంగులు సకలాంగులను వివాహం చేసుకుని దరఖాస్తు చేసుకుంటే లక్ష రూపాయలు అందజేస్తుంది. ఈఆర్‌ఎస్ (ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం) సబ్సిడీ రుణాలు అందజేస్తాం. ఇందులో భాగంగా రూ.లక్షకు 20శాతం, రూ.2లక్షలకు 30శాతం, రూ.3లక్షలు, అపై బడిన రుణాలకు 40శాతం సబ్సిడీ వస్తుంది. విద్యార్థులకు పోస్టు, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను సైతం అందిస్తోంది.

అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి రాధాదేవి, న్యాయవాదులు

వరంగల్ లీగల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి అన్నారు. ఈనెల 14న బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదరం బిల్డింగ్‌లో వరంగల్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాజ్యాంగం, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టులో వేసవి ఆటలు ప్రారంభం

వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహిస్తున్న వేసవికాల ఆటల పోటీలను గురువారం కోర్టులోని అంబేడ్కర్ న్యూ హాల్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కోక రాధాదేవి, ఎం.కృష్ణమూర్తిలు ప్రారంభించారు. ఆటలతో ఆరోగ్యంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సబ్ కోర్టు జడ్జి ఏఎస్ మూర్తి, డీడీపీఓ సత్యనారాయణ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ మోహన్, యాకస్వామి, రెండు జిల్లాల బాధ్యులు పూస శ్రీనివాస్, అమృతరావు, వెంకటరమణ, డి.శ్రీనివాస్, జి.శ్రీధర్‌రెడ్డి, విజేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు

- రైతులనుంచి ఫిర్యాదులూ రావద్దు
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



ధాన్యం కొనుగోళ్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆమె సివిల్ సప్లై, డీఆర్‌డీఏ, జిల్లా సహకార శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 164 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వరి పంట మద్దతు ధర తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు మహేందర్, వసంతలక్ష్మి, ప్రభాకర్ వర్మ, జగదీశ్వర్, నాగేశ్వరరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ జగన్నాథ్ పాల్గొన్నారు.

పింగిళి మహిళా కళాశాల సందర్శన

హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. కాలేజీలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కళాశాలలోని కోర్సుల వివరాలు, సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 14నుంచి 20 వరకు జరగనున్న అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్‌లు, కరపత్రాలను గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అగ్నిమాపకశాఖ అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు ఎం. భగవాన్ రెడ్డి, కె.జయపాల్ రెడ్డి, ఎ.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

క్యాంప్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ: స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.ఇందిర గరువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు వివరాలతో ఈనెల 25 లోపు దరఖాస్తులను ఓ సిటీ స్టేడియంలోని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అలాగే 14ఏళ్ల లోపు బాలబాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

వరంగల్ జిల్లాకు 6వేల రంజాన్ తోఫాలు

వరంగల్: వరంగల్ జిల్లాలోని ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా 6వేల తోఫాలు వచ్చినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విక్రంకుమార్ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి 3వేలు, నర్సంపేటకు 1,500, వర్ధన్నపేటకు 1,500 తోఫాలు వచ్చాయని పేర్కొన్నారు. వీటిని ఆయా నియోజకవర్గాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంపిణీ చేయాలని కోరారు.

రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక

- ఇఫ్తార్‌విందులో ఎంపీ దయాకర్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు వినయ్, నరేందర్, ఎమ్మెల్సీ సారయ్య, సీపీ రంగనాథ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నరేందర్, ఎమ్మెల్సీ సారయ్య, సీపీ రంగనాథ్

కాజీపేట రూరల్: పవిత్ర రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్‌బియాబాని దర్గాలో గురువారం రాత్రి దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సీపీ రంగనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్, వినయ్‌భాస్కర్, నరేందర్, సారయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను దేశంలో ఎక్కడా లేని విధంగా సమానంగా చూస్తుందన్నారు. పండుగ సందర్భంగా రంజాన్‌తోఫా అందించి సాయం చేస్తున్నారన్నారు. పోలీస్‌కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ తాను హిందువుగా పుట్టి ముస్లింలతో బాల్యంనుంచి కలిసి పెరిగానని, క్రిస్టియన్ విద్యాసంస్థలలో చదువుకున్నానని తెలిపారు. ఈ సంస్కృతి మన భారతదేశ గొప్పతనమని పేర్కొన్నారు. అనంతరం పీఠాధిపతి ఖుస్రుపాషా ప్రజాప్రనిధులను దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ కార్యక్రమంలో భక్తియార్ బియాబాని, ముస్లిం, హిందు, క్రైస్తవ, సిక్కు మత పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావును కలిసి వస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అసోషియేషన్ డిస్కం కార్యదర్శి బక్క దానయ్య కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ డిస్కం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. సొంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావును కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోషియేషన్ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు స్వదేశ్ కుమార్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రవి, చలపతి, విజయ్ రాజ్, రాజు, శ్యామ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల గోస

అన్నదాతలకు లాట్ ఐడీలు ఇవ్వని సిబ్బంది

- జీరో దందా కోసమేనని ఆరోపణలు
- అడ్తిదారుల కనుసన్నల్లోనే మిర్చి అమ్మకాలు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్ పాలకవర్గం

సాక్షి పరిశీలన



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు.

వరంగల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు పంటను అమ్ముకోవడంలో అండగా ఉండేందుకు మార్కెట్ కమిటీలు, రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి కన్వీనర్లను నియమిస్తున్నా.. వారు పెద్ద పెద్ద వాహనాల్లో అధికారదర్పం ఒలగపెటడమే కాని ఏనాడు మార్కెట్‌లో రైతుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో గురువారం 'సాక్షి' పరిశీలించి లాట్ ఐడీలపై రైతులను ప్రశ్నించగా మెజార్టీ రైతుల నుంచి ఇవ్వలేదన్న సమాధానం వచ్చింది.

ప్రతిరోజూ 35నుంచి 50వేల బస్తాల మిర్చి

సీజన్‌లో మిర్చి బస్తాలను గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావడంతో అలసిపోతున్నారు. అడ్తిదారుని గుమస్తాలు రాగానే తమ బస్తాలను ఆయనకు అప్పగించి కాలకృత్యాలు తీర్చుకోవడం, టీ, టిఫిన్ చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ జరిగే తంతును పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు మిర్చి ధరను నిర్ణయించేందుకు జెండా పాట పాడి గరిష్ట ధరకు ఒక లాట్ ఖరీదుదారుడు కొనుగోలు చేస్తారు. అనంతరం మార్కెట్‌లోని సేట్లు ఇంటికి, మార్కెట్ సిబ్బంది యార్డుల్లోకి, అధికారులు ఆఫీసుల్లోకి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మిర్చి దాదాపు ప్రతిరోజూ 35 నుంచి 50వేల బస్తాలు వస్తున్నాయి. యార్డుల్లోకి వచ్చిన మిర్చి బస్తాలు అప్పుడప్పుడు మాయం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల కెమెరాలు పనిచేస్తున్నందున కొన్ని బస్తాలు మాయమైన సందర్భంలో ఇరు వర్గాలను సమన్వయం చేసి మార్కెట్ అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న పరిస్థితి ఉంది.

జీరో దందాకు రాచమార్గం

రైతులకు లాట్ ఐడీలు జారీ చేస్తే తప్పనిసరిగా తూకం వేసి పీవోఎస్ మిషన్లలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల జీరో దందాకు అవకాశం లేకుండా పోతుంది. దీంతో కొంత మంది ట్రేడర్స్, వారి గుమస్తాలు, మార్కెట్‌లోని కొంత మందితో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఐడీల జారీలో అలసత్వం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది లాట్ ఐడీలు ఇచ్చారా.. లేదా అన్న విషయాలను యార్డుల్లో అధికారులు తిరిగితే తెలుస్తుంది. అధికారులు మాత్రం యార్డు ఆఫీసులకే పరిమితం కావడంతో మొత్తం దడవాయిలు, హమాలీలు, గుమస్తాల కనుసన్నల్లోనే గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలిసింది.



లాట్ ఐడీ(నమూనా)

లాట్ ఐడీల్లో అన్ని వివరాలు

రైతులు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి యార్డుల వద్ద పెట్టగానే మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు తప్పకుండా జారీ చేయాల్సి ఉంటుంది. లాట్ ఐడీ ఇస్తే అందులో రైతు పేరు, అడ్తిదారుని పేరు, తెచ్చిన మిర్చి రకం, ఎంత సరకు తెచ్చారనే వివరాలు ఉంటాయి. కాంటాలు పెట్టే సమయంలో లాట్ ఐడీలో పేర్కొన్న బస్తాలు ఉన్నాయా..రకం ..ఇతరత్రా విషయాలను రైతులు గమనించే అవకాశం ఉంటుంది. మార్కెట్ ఉన్నతాధికారులు లాట్ ఐడీలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పాలకవర్గం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాట్ ఐడీలు ఇవ్వలేదు..



15 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. నాకు లాట్ ఐడీ ఇవ్వలేదు. ధరలు అయ్యాయి. ఇంకా కాంటాలు కాలేదు. గత ఏడాదిలో ఒక సారి లాట్ ఐడీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రెండు సార్లు మార్కెట్‌కు మిర్చి అమ్మేందుకు వచ్చినా ఐడీలు ఇవ్వలేదు.

– యాకయ్య, లదాయిగడ్డ, కొత్తగూడ

అంతా సేటుకే ఎరుక..



46 బస్తాల సన్న మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ధర క్వింటాకు రూ.20,300లు అన్నారు. ఇంకా కాంటాలు కాలేదు. లాట్ ఐడీ ఇవ్వలేదు. మిర్చి బస్తాలు తెచ్చి సేటుకు అప్పగించడం వరకే తెలుసు. ఇవన్నీ ఏమి తెలియదు.

– వీరన్న నాయక్, గోప్యాతండా, కేసముద్రం

ధర అడ్తిదారులకే తెలుసు..



మార్కెట్‌కు 8 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. లాట్ ఐడీ ఇవ్వలేదు. అసలు ఎప్పుడూ కూడా లాట్ ఐడీలు ఇవ్వలేదు. మిర్చి బస్తాలు కాంటాలు కాలేదు. ధర కూడా అడ్తిదారులకే తెలుసు.

– రాజఅయిలు, గొల్లపల్లి, గణపురం

బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు రేపు హనుమకొండలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చని కేంద్రాన్ని నిరుద్యోగులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇటీవల చేపట్టిన ప్రజాపోరు యాత్ర వల్లే కేంద్రంలో, రాష్ట్రంలో విభజన హామీలపై చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని కూడా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా 12రోజుల పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న 200 మంది నాయకులు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయసారధి, నేదునూరి జ్యోతి, మేకల రవి, కర్రె భిక్షపతి, రాజారెడ్డి, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌రావు, రమేశ్, తోట భిక్షపతి, ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'యువిక-2023'కి నిఖిల్ ఎంపిక

- అభినందించిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్



కాశోజీ సెంటర్: బాల్యదశలోనే సైన్స్, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచి విద్యార్థులను ఈ రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ వేసవి సెలవుల్లో చేపడుతున్న యువిక-2023 కార్యక్రమానికి వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బట్టు నిఖిల్ ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా కేవలం 9వ తరగతి విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన ఈ యువిక (యువ విజ్ఞాన కార్యక్రమం)లో రెండు వారాల పాటు వచ్చే మే నెలలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు వివిధ కేంద్రాల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు స్పేస్ సైన్స్, స్పేస్ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో 350మంది విద్యార్థుల్లో 22వ ర్యాంకు సాధించి నిఖిల్ ఎంపిక కావడం పట్ల డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి నిఖిల్‌ను అభినందించారు. ఈ శిక్షణలో నిఖిల్‌కు అయ్యే పూర్తి ఖర్చులు ఇస్రో భరించనుంది.

ఎద్దు పొడిచి బీటెక్ విద్యార్థి మృతి

- మేతకు ఎడ్లను తీసుకెళ్లగా ఘటన



భానుప్రకాశ్(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: మేత మేపేందుకు తీసుకెళ్లిన ఎద్దు పొడవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పనికరి పద్మ, కొమురమల్లు దంపతులకు కుమారుడు భానుప్రకాశ్(19), కూతురు అలేఖ్య ఉన్నారు. భానుప్రకాశ్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంటివద్ద ఉండగా, తమకున్న రెండు ఎడ్లను మేపేందుకు భానుప్రకాశ్ పంటచేను వద్దకు తీసుకెళ్లాడు. ఎద్దు మూతికి కట్టిన బుట్టి విప్పే క్రమంలో ఆ ఎద్దు ఛాతిభాగంలో పొడవడంతో అతను కింద పడిపోయి, గట్టిగా కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న అతడి పెదనాన్న యాకమల్లు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి భానుప్రకాశ్‌ను బైక్‌పై కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మహబూబాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కాలేజీకి వెళ్లినా బతికేటోడు..

బీటెక్ ఫస్టియర్ చదువుతున్న భానుప్రకాశ్ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లాలనుకున్నాడు. కొత్త డ్రెస్ కొనుక్కొని శుక్రవారం వెళ్లొచ్చని ఇంట్లో చెప్పడంతో ఇంటి వద్ద ఉండిపోయాడు. అతను ఒకవైపు చదువుకోవడంతోపాటు, తన వంతుగా వ్యవసాయ పనులను చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు ఎడ్లను మేపేందుకు వెళ్లిన అతన్ని ఎద్దుపొడవడంతో మృతిచెందాడు. కాలేజీకి వెళ్లినా బతికేటోడివంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారందరిని కంటతడిపెట్టించింది. భానుప్రకాశ్ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ

వరంగల్ క్రైం: వరంగల్ ఓ సిటీ కేంద్రంగా ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువతులతో సహా మొత్తం ఆరుగురు ముఠా సభ్యులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ తెలిపారు. వీరినుంచి మూడు ల్యాప్‌టాప్‌లు, 13 సెల్‌ఫోన్లు, రూ.1.90 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, వివిధ బ్యాంకులకు సంబంధించిన డెబిట్, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయచూర్ ప్రాంతానికి చెందిన పఠాన్‌బాబ, పటాన్ ఖాసీం ఖాన్, ఒడిశాకు చెందిన చాందిన నాగ్, సయ్యద్ సల్మాబేగ్, ఖమ్మానికి చెందిన మొగల్ మున్నా, గుంజ కళ్యాణ్‌లు ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్‌కు తెరతీశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా బెట్టింగ్‌లో పాల్గొనేవారు ముందుగా ఆన్‌లైన్‌లో కొంత మొత్తంలో డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వారికి బెట్టింగ్ నిర్వాహకులు యూజర్ నేమ్, పాస్‌వర్డ్ అందజేస్తారు. కొద్ది రోజుల క్రితం ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడంతోఈ ముఠా జోరుగా బెట్టింగ్‌లు నిర్వహిస్తోంది. గెలిచిన వారికి రెండింతలు డబ్బును అందజేసేవారు. ఈ ముఠా గతంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో కూడా బెట్టింగ్ నిర్వహించిందని తెలిపారు. ఓ సిటీ కేంద్రంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో మిల్స్ కాలనీ పోలీసులు బుధవారం సాయంత్రం ఓ ఇంటిపై దాడి చేసి ఈ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి ల్యాప్ టాప్‌లు, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు డీసీపీ బారి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మిల్స్ కాలనీ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు ముస్కా శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, సైబర్ క్రైం ఏఏఓ ప్రశాంత్, మిల్స్‌కాలనీ ఎస్సై కుమార్, ఏఎస్సై స్వరూప, కానిస్టేబుళ్లు బొసింగ్, వీరన్న, హోంగార్డు నాగేశ్వరరావులను అభినందించారు.

బట్టల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ఎంపి గుప్తా రెడీమేడ్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వల్పంగా దగ్ధమైంది. దుకాణ యజమాని సోదరుడు అభిషేక్ అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి మెయిన్ ఆన్ చేశారు. కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ ఆన్ చేశారు. తిరిగి విద్యుత్ రావడంతో దుకాణంలోని మూడో అంతస్తులోని గోడౌన్‌లో మంటలు రావడాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు నేతృత్వంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ నెలలో రంజాన్ పండుగ ఉండడంతో కొత్త స్టాక్ తెప్పించామని వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం జరిగిందని అభిషేక్ అగర్వాల్ తెలిపారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్..



ప్రసాద్ (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన దామెర మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్ రోడ్డుకు చెందిన గుగ్గిళ్ల ప్రసాద్ (53) ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి విధులు ముగించుకొని హనుమకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గుంతలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ అవయవాలు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు.

క్రిప్టో కరెన్సీ మాయలో ప్రైవేట్ ఉద్యోగి

కమలాపూర్: ఆన్‌లైన్ క్రిప్టో కరెన్సీలో ఇన్వెస్ట్ చేసి డబ్బులు రెట్టింపు చేసుకోవచ్చనే మోసగాని మాటలు నమ్మి ఓ ప్రైవేట్ ఉద్యోగి మోసపోయాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. కమలాపూర్ ఎస్సై ఎం.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేశరాజుపల్లికి చెందిన ఇసంపల్లి వినయ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత మార్చి 27న ఒక గుర్తు తెలియని వ్యక్తి వినయ్‌కి ఫోన్‌చేసి ఆన్‌లైన్‌లో క్రిప్టో కరెన్సీలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా డబ్బులు రెట్టింపు చేసుకోవచ్చని ఆశ చూపాడు. అతని మాటలు నమ్మిన వినయ్ తన గూగుల్ పే, ఫోన్ పే నంబర్ల నుంచి దశల వారీగా పలు ఫోన్ నెంబర్లకు రూ.19,540 పంపించాడు. ఎంతకీ డబ్బులు తిరిగి రాకపోగా తాను డబ్బు పంపించిన నంబర్లకు బాధితుడు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆ తరువాత పలు నంబర్ల వినయ్‌కి ఫోన్లు చేసి మరింత పెట్టుబడి పెట్టాలని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రాగా, తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైం, కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

గీసుకొండ: జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పేరు నమోదు చేసిన గర్భిణులకు అవసరమైన వైద్య సేవలందించాలన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి వైద్య సేవలు అందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను సమయం ప్రకారం ఇవ్వాలన్నారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌లో 18 ఏళ్లు నిండిన వారిని పరీక్షించి అవసరమైన మందులివ్వాలన్నారు. భ్రూణహత్యలు, మాతాశిశు మరణాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు పద్మశ్రీ, చల్లా మధుసూదన్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే బంగారు భవిష్యత్



మంత్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా సీజేఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు

జనగామ: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని బంగారు భవిష్యత్ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి బిషప్ ఉడుముల బాల అధ్యక్షతన జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆషామాషీగా తీసుకుంటే, ఆగమైపోతారన్నారు. కళాశాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, బీటీ రోడ్డు సైతం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులన్నారు. బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ సీజేఐటీలో 25 ఏళ్ల కాలంలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ప్రపంచంలోనే అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీజేఐటీ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, సీజేఐటీ డైరెక్టర్ అగస్టిన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాల్లో సీజేఐటీ ఒక్కటిగా నిలిచి పోతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, విద్యా వేత్తలను కాలేజీ నిర్వాహకులు శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవాల కన్వీనర్లు బి.స్వప్న, కరుణాకర్, ఏఎస్ రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : ఉరివేసుకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డులోని ఆర్టీసీ కండక్టర్ రేసు శ్రీనివాస్ (51) నర్సంపేట డిపోలో విధులు నిర్వహించి కొన్ని సంవత్సరాల క్రితం తొర్రూర్ డిపోకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. అయితే శ్రీనివాస్‌కు ఆరోగ్య స్థితి బాగలేకపోవడంతో విధులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13న విధుల నుంచి తొలగించారు. దీంతో మనోవేదనకు గురై శ్రీనివాస్ ఇంట్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.